సాక్షి
అనంతపురం
శనివారం | 5 | ఆగస్టు | 2023



చీనీ టన్ను రూ.17 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.17 వేలు పలికాయి. మార్కెట్‌కు 1,006 టన్నుల కాయలు వచ్చాయి.



టమాట కిలో రూ.133

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.133 పలికింది. కనిష్టం రూ.80, సరాసరి రూ.106 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.4°/22.6°

జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం కొనసాగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

మూడు రోజుల పాటు 'నా భూమి - నాదేశం'



గ్రామాల్లో ఆవిష్కరించనున్న శిలాఫలకం

అనంతపురం టౌన్: 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామపంచాయతీల్లో మూడు రోజుల పాటు 'నా భూమి - నాదేశం' కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ నెల తొమ్మిదో తేదీన ప్రధాని, ముఖ్యమంత్రి సందేశాలతో కూడిన శిలాఫలకాల ఆవిష్కరణ, పదో తేదీన 'వసుధకు వందనం' కార్యక్రమంలో భాగంగా 75 ఏళ్ల స్వాతంత్ర్యానికి గుర్తుగా మొక్కలు నాటే కార్యక్రమం, 14న 'వీరులకు వందనం' పేరిట గ్రామ పంచాయతీల్లోని స్వాతంత్ర్య సమరయోధులు, దేశ రక్షణలో ఉన్న ఆర్మీ ఉద్యోగులను సత్కరించే విధంగా 'నా భూమి నాదేశం' నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు విధుల్లోకి జేసీ

అనంతపురం అర్బన్: జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ శనివారం విధుల్లోకి చేరనున్నారు. వ్యక్తిగత పనులపై ఆయన గత నెల 21 నుంచి ఈ నెల 4 వరకు సెలవులో వెళ్లారు. సెలవు ముగియడంతో విధులకు హాజరుకానున్నారు.

'నాక్' బృందం పరిశీలన



అధ్యాపకులతో మాట్లాడుతున్న 'నాక్' బృందం

రాప్తాడురూరల్: నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) బృందం సభ్యులు అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో కలియతిరిగారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా తొలిరోజు శుక్రవారం త్రిసభ్య కమిటీ సభ్యులు ప్రొఫెసర్ దామోదర్ మిశ్రా (చైర్మన్), రామచంద్రమోహన్, సుజాత వచ్చారు. ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి, నాక్ కోఆర్డినేటర్ అచ్యుతానంద, సిబ్బంది, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. కళాశాల అభివృద్ధి, ఐదేళ్లలో వివిధ రంగాల్లో సాధించిన ప్రగతిని ప్రిన్సిపాల్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సభ్యులు పలు ప్రశ్నలు అడిగారు. అకడమిక్, పరిశోధన, ఉన్నత విద్య, ఉపాధిపరంగా విద్యార్థులు సాధించిన ప్రగతిని కోఆర్డినేటర్ అచ్యుతానంద వివరించారు. అనంతరం కామర్స్, తెలుగు, బాటనీ, జువాలజీ, చరిత్ర తదితర విభాగాలను పరిశీలించారు. ఆయా విభాగాల్లో సాధించిన ప్రగతి, నిర్వహించిన కార్యక్రమాలను ఫొటో గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాలు తమ విద్యార్థులు సాధించిన విజయాలను వివరించాయి. పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, బోధన, బోధనేతర సిబ్బందితో 'నాక్' బృందం సభ్యులు వేర్వేరుగా మాట్లాడారు. సాయంత్రం డ్రామా హాలులో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను సభ్యులు తిలకించారు.

'సీవీఆర్టీ' వ్యవహారంపై ఆరా

సాక్షి ఎఫెక్ట్..

తాడిపత్రి అర్బన్: తాడిపత్రి ఇంజినీరింగ్ కళాశాల(టెక్)ను శుక్రవారం జేఎన్‌టీయూ అధికారులు తనిఖీ చేశారు. గురువారం సీవీ రామన్ ఇంజినీరింగ్ కళాశాల (సీవీఆర్టీ)కు చెందిన బీటెక్ ఫస్టియర్ విద్యార్థులు టెక్ కేంద్రంలో ఒకరికి బదులు మరొకరు పరీక్షలు రాస్తున్నట్లు అబ్జర్వర్లు, ఇన్విజిలేటర్లు గుర్తించి రూల్ 3 ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై 'ఒకరికి బదులు మరొకరు' అన్న శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జేఎన్‌టీయూ అధికారులు స్పందించి తనిఖీలు చేశారు. సీవీఆర్టీ విద్యార్థుల హాల్‌టికెట్ల మార్ఫింగ్ నిర్వాకంపై ఆరా తీశారు. గురువారం జరిగిన సంఘటనకు సంబంధించి పూర్తి ఆధారాలను 'టెక్' కరస్పాండెంట్ అశోక్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఇ.వి.సుబ్బారెడ్డిలు జేఎన్‌టీయూ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్‌కు అందజేశారు.

సీవీఆర్టీ కళాశాలకు మొట్టికాయలు..

సీవీఆర్టీ కళాశాల నిర్వాకంపై జేఎన్‌టీయూ అధికారులు సీరియస్ అయినట్లు సమాచారం. సదరు కళాశాల యాజమాన్యానికి మొట్టికాయలు వేసినట్లు తెలిసింది. శుక్రవారం కళాశాల యాజమాన్యాన్ని యూనివర్సిటీకి పిలిపించారు. తమ విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణులు కాలేరని భావించిన సీవీఆర్టీ కళాశాల యాజమాన్యం అసలు విద్యార్థుల ఫొటోలతో పాటు ఐడీ కార్డులను మార్ఫింగ్ చేసి పరీక్షలు రాసేందుకు పంపించినట్లు అధికారులు తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది.

కళ్లల్లో కలవరం

- విస్తరిస్తున్న కళ్లకలక
- సరిహద్దు ప్రాంతాల్లోనే ఎక్కువ
- వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



- రాయదుర్గం మోడల్ స్కూల్‌లో 6 నుంచి ఇంటర్ వరకు 630 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 16 మందికి పైగా కళ్లకలక వైరస్ బారినపడ్డారు. అప్రమత్తమైన ఉపాధ్యాయులు వారందరినీ ఇళ్లకు పంపారు. 9 నుంచి ఇంటర్ వరకు గల వసతి గృహంలో 45 మంది విద్యార్థులుంటే ఇద్దరికి కళ్లకలక లక్షణాలు కనిపించాయి.
- రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో 4 రోజుల క్రితం కళ్లకలక వైరస్‌తో బాధపడుతున్న ఐదుగురు చికిత్స కోసం వచ్చారు. తాజాగా ఆ సంఖ్య 25కు చేరుకుంది. ప్రైవేటు ఆస్పత్రుల్లో మరింత ఎక్కువగా నమోదవుతున్నట్లు తెలిసింది. మెడికల్‌షాపుల్లోనూ కళ్లకలక మందుల విక్రయం పెరిగింది.

జిల్లాలో కళ్లకలక బాధితులు పెరుగుతుండటం ఆందోళన రేపుతోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖను అప్రమత్తం చేసింది. ప్రభుత్వాస్పత్రుల్లో సరిపడునన్ని మందులు అందుబాటులో ఉంచడంతో పాటు క్షేత్రస్థాయిలో ఉచితంగా డ్రాప్స్, మందులను పంపిణీ చేసేలా ముందస్తు జాగ్రత్తలు చేపడుతోంది.



రాయదుర్గం: జిల్లాలో కళ్లకలక (కంజంక్టివైటిస్) వైరస్ విస్తరిస్తోంది. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో విజృంభిస్తున్న ఈ వైరస్ క్రమంగా జిల్లాలో కూడా పుంజుకుంటోంది. అంటువ్యాధిగా చెప్పుకునే ఈ వైరస్ ఒకరినుంచి మరొకరికి త్వరగా వ్యాప్తి చెందుతోంది. కర్ణాటక సరిహద్దున ఉన్న రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు ప్రాంతాల్లో కేసుల సంఖ్య పెరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. వైరస్ నివారణకు జిల్లా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు. జిల్లాలో 2,532 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 3,76,847 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో మోడల్, కేజీబీవీ, వసతిగృహాల్లో విద్యార్థులు కళ్లకలక వైరస్‌బారిన పడుతున్నారు. అప్రమత్తమైన ఉపాధ్యాయులు వైరస్ సోకిన విద్యార్థులందరినీ వెంటనే ఇళ్లకు పంపించేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 44 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 8 కమ్యూనిటీ వైద్యశాలలు, 3 ఏరియా ఆస్పత్రులతో పాటు జిల్లా కేంద్రంలోని సర్వజనాస్పత్రిలో రోజూ ఏడు వేల మంది దాకా ఓపీ సేవలు పొందుతున్నారు. వారం రోజుల నుంచి పలు ఆస్పత్రుల్లో కళ్లకలక కేసులు కూడా నమోదయ్యాయి. ఈ వ్యాధితో పెద్దగా ముప్పు లేకపోయినా జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

కళ్లకలక వ్యాప్తి ఇలా..

కంటి గుడ్డు చుట్టూ తెల్లని పొర రెప్పల వెనుక ఉండే పొరను కంజెటైవా అంటారు. దుమ్మూ ధూళి, వేడి నీళ్లు, అధిక గాలి ఆ పొరలను తాకితే తీవ్ర ప్రభావానికి గురవుతాయి. సున్నితమైన ప్రాంతాలు కావడంతో వేగంగా ఇన్ఫెక్షన్ బారిన పడతారు. కళ్లు ఎర్రగా మారుతాయి. ఒక కంటికి గానీ, రెండు కళ్లకూ గానీ ఈ వైరస్ వచ్చే అవకాశం ఉంది. ఇన్ఫెక్షన్ కారణంగా కణజాలంలో చేరిన బ్యాక్టీరియా వైరస్ ఇతరులకు వ్యాపించే అవకాశం ఉంది.

జాగ్రత్తలు..

- కంటిని ఎక్కువ సార్లు నలపకూడదు. మెత్తని గుడ్డతో నెమ్మదిగా తుడవాలి. తరచూ నీటితో శుభ్రం చేసుకోవాలి.
- బయట తిరగకపోవడం మంచిది.
- వైరస్ బారినపడిన వారు కుటుంబ సభ్యులకు దూరంగా ఉండాలి
- ఐదు రోజుల నుండి వారం రోజుల్లోపు కళ్లకలక తగ్గిపోతుంది. ఇతరులకు ఇబ్బంది కలగకుండా వైద్యుల సలహా, సూచనలు పాటించాలి.

లక్షణాలు కనిపిస్తే ఇంటికి పంపుతున్నాం



వారం క్రితం ఒకరితో మొదలై క్రమంగా 15 మందికి చేరింది. దీంతో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాం. కళ్లకలక వైరస్ సోకిన విద్యార్థులను ఇళ్లకు పంపిస్తున్నాం. కొందరు రికవరీ అయ్యి తిరిగి వచ్చారు. మరి కొందరు చికిత్స పొంది కోలుకుంటున్నారు. ప్రమాదం లేకపోయినా ఇతరకులను వైరస్ సోకకుంటా కట్టడి చేపట్టాం. అన్ని జాగ్రత్తలూ చేపట్టడంతో కొత్తగా ఒక్క కేసు కూడా నమోదు కాలేదు.

– వెంకటేశులు, ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్, రాయదుర్గం

స్వీయ నియంత్రణ పాటించాలి



కళ్లకలక లక్షణాలు బయటపడినప్పుడు సదరు వ్యక్తి స్వీయనియంత్రణ పాటించాలి. తోటి వారికి దూరంగా ఉండటానికి ప్రయత్నించాలి. వైద్యుల సూచన మేరకు కళ్లలో చుక్కల మందు వేసుకోవాలి. వారం రోజుల పాటు ఆరోగ్య సూత్రాలు పాటిస్తే సమస్య నుంచిబయట పడవచ్చు. ముఖ్యంగా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి. ఏదేని సమస్య ఎదురైతే వెంటనే వైద్యశాఖకు సమాచారం ఇవ్వాలి.

– భాస్కర్, కంటి వైద్యులు, రాయదుర్గం

అందుబాటులో మందులు



జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ కళ్లకలక వైరస్ నివారణ మందులు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా మందులన్నీ సిద్ధం చేసి ఉంచింది. వైరస్‌బారిన పడ్డవారు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళితే ఉచితంగా మందులు ఇస్తారు. కళ్లకలక వైరస్ వల్ల పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. జిల్లాలో ఇప్పుడిప్పుడే కేసులు మొదలు కావడంతో పూర్తిస్థాయిలో కట్టడికి చర్యలు చేపట్టాం. ప్రజలంతా జాగ్రత్తలు పాటించాలి.

– యుగంధర్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి

జూనియర్ లైన్‌మెన్లు రెగ్యులర్

అనంతపురం టౌన్: విద్యుత్ శాఖలో జూనియర్ లైన్‌మెన్లుగా రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్ఈ సురేంద్ర తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న జూనియర్ లైన్‌మెన్లు 380 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. వీరందరినీ రెగ్యులర్ చేశామని, విద్యుత్ సంస్థ నిబంధనల మేరకు జీతాలతోపాటు అలవెన్సులు, పీఆర్‌సీ అమలు చేయనున్నామని తెలిపారు.

కణేకల్లు సొసైటీకి ఉత్తమ అవార్డు



అవార్డును అందుకొంటున్న కణేకల్లు సొసైటీ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి

కణేకల్లు: రైతులకు అత్యుత్తమ సేవలందిస్తూ లాభాల బాటలో నడుస్తున్న కణేకల్లు సొసైటీ (పీఏసీఎస్)కి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సొసైటీ అవార్డు ప్రకటించింది. విజయవాడలో శుక్రవారం జరిగిన రాష్ట్ర సహకార సంఘం వజ్రోత్సవాలు సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఉత్తమ సొసైటీ అవార్డును కణేకల్లు పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరికి అందజేశారు. కార్యక్రమంలో ఏడీసీసీబీ అధ్యక్షురాలు లిఖిత, మాజీ అధ్యక్షుడు పామిడి వీరాంజినేయులు, కణేకల్లు పీఏసీఎస్ సీఈఓ హనుమంతు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న తదితరులు పాల్గొన్నారు.

అందరి కృషి వల్లే సొసైటీకి అవార్డు..

కణేకల్లు పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం) అభివృద్ధికి తనతోపాటు సిబ్బంది అందరూ ఎంతో కృషి చేశారని అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి తెలిపారు. ఫోన్‌లో ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. సొసైటీ ద్వారా రైతులకు పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలివ్వడంతోపాటు ఫర్టిలైజర్ షాపు నిర్వహించి పరపతేతర సేవలను విస్తృతంగా నిర్వహించినట్లు తెలిపారు. లాభాపేక్ష లేకుండా తక్కువ మార్జిన్‌తో ఫర్టిలైజర్‌షాపు ద్వారా రైతులకు మందులు, ఎరువులను విక్రయించినట్లు వివరించారు. తమ కష్టానికి తగ్గ ప్రతిఫలం నేడు దక్కడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఉత్తమ సొసైటీ అవార్డుకు సహకరించిన ఏడీసీసీబీ చైర్‌పర్సన్ లిఖితకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సేవలో నేను తోపునే

- బాబూ.. జన్మలో మళ్లీ నీవు సీఎం కాలేవు
- రూ.2వేల కోట్ల దోపిడీ నాది కాదు పరిటాల సునీతదే
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: ప్రజలకు సేవ చేయడంలో వందకు వంద శాతం నేను తోపునే అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఆత్మకూరు ఎంపీపీ హేమలతతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రాజెక్టుల సందర్శన కోసం వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆత్మకూరులో తనపై విమర్శలు చేయడం తగదన్నారు. ప్రకాష్‌రెడ్డి తోపా అంటూ వ్యాఖ్యానించారని, ప్రజా సేవ చేయడంలో నేను తోపునో కాదో ప్రజలు నిర్ణయిస్తారని అన్నారు. అణచివేస్తా, తొక్కేస్తా, దొంగదెబ్బ తీయండి తమ్ముళ్లూ అనడం చూస్తుంటే చంద్రబాబు ఫ్యాక్షనిస్టా.. క్రిమినలా.. మోసగాడా అనేది అర్థం కావడం లేదన్నారు. తనను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్న రాప్తాడు నియోజకవర్గ ప్రజల కోసం తాను ఎంత దూరానికైనా వెళ్తానన్నారు. తనను బెదిరిస్తే భయపడేవాడిని కాదన్నారు. 2019 ఎన్నికల్లో ప్రజల చేత తిరస్కరణకు గురైన చంద్రబాబు జన్మలో మళ్లీ ముఖ్యమంత్రి అయ్యే యోగం లేదన్నారు. తాను రూ.2వేల కోట్లు దోపిడీ చేశానని చంద్రబాబు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. తాను అంత కూడబెట్టినట్లు నిరూపిస్తే.. ఆ మొత్తం మీకే చెందేలా వంద రూపాయల స్టాంపు మీద తాను కుటుంబ సభ్యులతో కలిసి సంతకం చేసిస్తానని, తనకు రూ.50 కోట్లు ఇస్తే చాలన్నారు. లేదా తాను ఎమ్మెల్యే అయ్యాక సంపాదించిన ఆస్తులు కేవలం రూ.20 కోట్లకే రాసిస్తానని, మిగతా రూ.1980 కోట్లు నీవు తీసుకుని.. రాహుల్‌గాంధీతో మాట్లాడి కర్ణాటక రాష్ట్రప్రభుత్వం ద్వారా తుంగభద్ర సమాంతర కాలువ నిర్మాణానికి ఖర్చు పెడదామన్నారు. ఇందుకు చంద్రబాబు సిద్ధమా అని సవాల్ చేశారు. వాస్తవానికి టీడీపీ పాలనలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.2వేల కోట్లు దోపిడీ చేసింది పరిటాల సునీత అని విరుచుకుపడ్డారు.

బాబు వస్తే బడాబాబులకు.. జగన్ వస్తే పేదలకు పండగ...

'నోటికి ఏదొస్తే అది మాట్లాడితే మేధావనుకుంటే పొరపాటే. ప్రజలు నిన్ను (చంద్రబాబును) ఛీ కొట్టినా ఇంకా సిగ్గు రాలేదు. టీడీపీ హయాంలో ప్రాజెక్టుల పేరుతో రూ.40 వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారు. నీ కాంట్రాక్టర్లు వేలకోట్ల రూపాయలకు అధిపతులయ్యారు. నువ్వు అధికారంలోకి వస్తే బడా బాబులకు పండగ. అదే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే పేద ప్రజలకు పండగ' అని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. జీడిపల్లి, మల్యాల రిజర్వాయర్లను తానే కట్టానని చంద్రబాబు అబద్ధాలు ఆడుతున్నారన్నారు. పేరూరు డ్యామ్‌కు పైసా ఖర్చు లేకుండా తాము నీళ్లు తీసుకువచ్చామన్నారు. నీ (చంద్రబాబు) హయాంలో నీళ్లు ఇచ్చి ఉంటే మీ మంత్రి(సునీత)కి మంచి పేరు వచ్చేదన్నారు. బాధ్యత కలిగిన ప్రతిపక్ష పార్టీ నాయకుడిగా తాను ఆనాడు ప్రతిపాదనలు చేస్తే పట్టించుకోకుండా నువ్వు చేయాల్సిన దోపిడీ అంతా చేసేశావని ధ్వజమెత్తారు. హంద్రీ-నీవా ఫేజ్-2లో మిగిలిన రూ.10 కోట్ల పనులను రూ.100 కోట్లకు పెంచుకుని దోపిడీ చేసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. గొల్లపల్లి రిజర్వాయర్ అనేది హంద్రీ-నీవా ప్రాజెక్టులో భాగమన్నారు. వైఎస్సార్ హయాంలో మొదటి దశ పనులు పూర్తి చేసి, రెండో దశ పనులను 70 శాతం పూర్తి చేశారన్నారు. రిజర్వాయర్‌కు అవసరమైన వెయ్యి ఎకరాల భూమిని సేకరించారన్నారు. రిజర్వాయర్ పేరుతో రూ.1,400 కోట్లు దోచుకుతిన్న పెద్ద దొంగ చంద్రబాబు అని ఆరోపించారు. జాకీ పరిశ్రమ కోసం రూ.145 కోట్లు విలువ చేసే పేదల భూములను రూ.3కోట్లకు ఎలా కొంటావని ప్రశ్నించారు. జాకీ పరిశ్రమ ఏర్పాటు కాకుండా చేసింది మీరేనన్నారు. హత్యా రాజకీయాలను ప్రోత్సహించడంలో చంద్రబాబు దిట్ట అని ఆరోపించారు. విజయ డెయిరీని పతనం చేసిన ఆర్థిక ఉగ్రవాది అని అన్నారు. హెరిటేజ్ పేరుతో రైతుల నుంచి తక్కువ ధరకు పాలు సేకరించి, మార్కెట్లో ఎక్కువకు అమ్మి లాభార్జన పొందావన్నారు. తాము రైతులను ఆదుకునేందుకు 'అమ్మ' డెయిరీని ఏర్పాటు చేశామన్నారు. పరిటాల రవిని అడ్డుపెట్టుకుని విప్లవ కారులను హత్యలు చేయించిన వ్యక్తి చంద్రబాబు అని ఆరోపించారు. ఈసారి ఎమ్మెల్యే ఎన్నికల్లో 30 వేలకు పైగా ఓట్ల మెజార్టీతో తాను గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

పంద్రాగస్టుకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో ఎస్పీ కె.శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ జేసీ గాయత్రీదేవి, అసిస్టెంట్ కలెక్టర్ కుశాల్‌జైన్

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం

అనంతపురం అర్బన్: పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఎం.గౌతమి జిల్లా అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య వేడుకల నిర్వహణపై కలెక్టర్ శుక్రవారం రెవెన్యూ భవన్‌లో ఎస్పీ కె.శ్రీనివాసరావుతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. అప్పగించిన బాధ్యతలను అధికారులు ప్రత్యేక శ్రద్ధతో నిర్వర్తించాలని చెప్పారు. విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు చూపించిన ఉద్యోగులు, అధికారులను సేవా అవార్డుకు ఎంపిక చేయాలన్నారు.

9న 'నా భూమి – నా దేశం' కార్యక్రమాలు

ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ముగింపు వేడుకల్లో భాగంగా జిల్లాలో ఈ నెల 9 నుంచి 'నా భూమి – నా దేశం' కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. స్వాతంత్ర్యం కోసం జీవితాలను త్యాగం చేసిన వారిని స్మరించుకోవాలన్నారు. 9న అనంతపురం ఆర్ట్స్ కళాశాల నుంచి పీస్ మెమోరియల్ హాల్ వరకు హెరిటేజ్ వాక్ నిర్వహించాలని ఆదేశించారు. 10న పంచాయతీల నుంచి మట్టి, నీరు సేకరించాలన్నారు. కలెక్టరేట్‌లో ఐక్యత మొక్క నాటాలన్నారు. 11న వీరన్ కా వందన్, శిలాఫలకం ఆవిష్కరించాలన్నారు. 12న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పోటీలు నిర్వహించాలన్నారు. 13న వసుధ వందన్ కింద మొక్కలు నాటాలన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు 14న రెవెన్యూభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ గాయత్రీదేవి, అసిస్టెంట్ కలెక్టర్ కుశాల్‌జైన్, ఆర్డీఓ మధుసూదన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి..

నులిపురుగుల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ గౌతమి వైద్యాధికారులను ఆదేశించారు. నులిపురుగుల నిర్మూలన అంశంపై కలెక్టర్ శుక్రవారం రెవెన్యూ భవన్‌లో వైద్యారోగ్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 10న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలని చెప్పారు. నులిపురుగుల నిర్మూలన వల్ల కలిగే ప్రయోజనాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ యుగంధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సకాలంలోనే ఆయకట్టుకు నీరు

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి వెల్లడి
- హెచ్చెల్సీలో అధికారులు, రైతులతో కలిసి గంగపూజ



ఆంధ్ర సరిహద్దులోని హెచ్చెల్సీలో గంగపూజ చేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి దంపతులు

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి ఊహించని విధంగా వరద వచ్చినందున సకాలంలోనే హెచ్చెల్సీ ఆయకట్టుకు నీరు విడుదల చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం బొమ్మనహాళ్ మండలంలోని ఆంధ్ర సరిహద్దు 105వ కిలోమీటర్ వద్ద హెచ్చెల్సీలో ప్రవహిస్తున్న తుంగభద్ర జలాలకు ప్రభుత్వ విప్ కాపు ఆయన సతీమణి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి, హెచ్చెల్సీ అధికారులు, ఆయకట్టు రైతులతో కలిసి గంగపూజ నిర్వహించారు. అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య తుంగభద్ర జలాలకు పసుపు కుంకుమలు, టెంకాయలు, గాజులు, నూతన వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. అనంతరం విప్ కాపు రామచంద్రరెడ్డి మాట్లాడుతూ వరద నీటితో టీబీ డ్యాం పూర్తిస్థాయిలో నిండుతోందన్నారు. జలాశయం నుంచి హెచ్చెల్సీ ద్వారా జిల్లాకు నీరు విడుదల చేయడంతో ఆంధ్ర సరిహద్దులో గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. తుంగభద్ర జలాలు ఆంధ్రా, కర్ణాటక ప్రాంతాల తాగు, సాగు నీరందించే వరప్రదాయినిగా ఆయన పేర్కొన్నారు. హెచ్చెల్సీ నీటితో జిల్లాలో 2.35 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలను, రైతులను కాపాడాలని, తుంగభద్ర జలాలతో పాడి పంటలు సమృద్ధిగా సాగాలని వేడుకున్నామన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో సకాలంలో వర్షాలు కురుస్తున్నాయని రైతులు ఆనందంగా పంటలు సాగు చేస్తున్నారన్నారు. చంద్రబాబు హయాంలో వర్షాలు లేక, పండిన అరకొర పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక గిట్టుబాటు ధరతో ప్రభుత్వమే ఆయా పంటలు కొనుగోలు చేస్తోందన్నారు. ఈసారి నీరు ఆశాజనకంగా ఉన్నందున నిర్ణయించిన తేదీల్లోనే ఆయకట్టుకు నీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జేఈలు గోపాల్‌నాయక్, అల్తాఫ్, మార్కెట్ యార్డు చైర్మన్ భోజరాజు నాయక్; జెడ్పీటీసీ సభ్యురాలు నీలవేణి, వైస్ ఎంపీపీ రమేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, వెంటాక్షిపతిరెడ్డి, ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జి.ఎం.నాయుడు, సత్యన్న, ఎంసీహెచ్ రాజ్‌కుమార్, పరమేశ్వర, యోగేశ్వరరెడ్డి, రాళ్ల తిమ్మారెడ్డి, వన్నల్లి రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లెక్చరర్ కారుకు నిప్పు



కాలిపోయిన కారు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలోని అశోక్‌నగర్‌లో గురువారం అర్ధరాత్రి కలకలం రేగింది. ఓ ఇంటి ముందు ఆపి ఉంచిన కారుకు దుండగులు నిప్పుపెట్టడంతో బాధితులు, స్థానికులు ఆందోళనకు గురయ్యారు. వన్‌టౌన్ సీఐ రెడ్డెప్ప వివరాలమేరకు.. స్థానిక ఎస్‌ఎస్‌బీఎన్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్న చంద్రశేఖరరెడ్డి కుటుంబం అశోక్‌నగర్‌లోని హరిహర ఆలయం సమీపంలో నివాసం ఉంటోంది. రోజువారిగానే ఇంటి ముందు కారు (క్రెటా)ను పార్క్ చేశారు. అయితే అర్ధరాత్రి 1 గంట సమయంలో కారు మంటల్లో తగలబడుతూ కనిపించింది. మంటలను ఆర్పిన అనంతరం చూడగా కారు కింద చెత్తాచెదారాన్ని వేసి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టిన ఆనవాళ్లు కనిపించాయి. ఎవరో కావాలనే ఈ పని చేశారని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే తమకు ఎవరితోనూ శతృత్వం లేదని చంద్రశేఖర్ చెబుతున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

ఉరవకొండ: మండల పరిధిలోని వెలిగొండ గ్రామానికి చెందిన నాగమ్మ (68) అనే వృద్ధురాలు అనారోగ్య కారణాలతో శుక్రవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. నాగమ్మ గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు ఎన్ని ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించినా తగ్గలేదు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన నాగమ్మ ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకోని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు ఘటనపై విచారణ చేపట్టారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రాప్తాడు: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. మండలంలోని హంపాపురం గ్రామ రోడ్డు సమీపంలో 44వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో 35 ఏళ్ల గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడన్నారు. రెండు రోజులుగా మతిస్థిమితం లేకుండా రెండోరోజులుగా రోడ్డుపై తిరుగుతున్నాడని స్థానికులు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు ఎస్‌ఐ సెల్ 9440796817ను సంప్రదించాలన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం.. క్రీడా గ్రామం

- గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులకు ఆర్డీటీ వెన్నుదన్ను
- అనంత క్రీడా గ్రామంలో ఉచిత శిక్షణ
- ఫుట్‌బాల్ క్రీడపై ప్రత్యేక శ్రద్ధ
- జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులు



అనంత క్రీడా గ్రామంలోని మైదానంలో ఫుట్‌బాల్ సాధన చేస్తున్న క్రీడాకారులు

అనంతపురం: ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ అనంతపురంలో ఏర్పాటు చేసిన అనంత క్రీడా గ్రామం క్రీడాకారులకు కల్పతరువుగా మారింది. అంతర్జాతీయస్థాయి క్రీడలకు వేదిక కావడమే కాదు వేలాది మంది క్రీడాకారులను జాతీయస్థాయికి అందించిన ఘనత ఆర్డీటీ (రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు)కే దక్కుతుంది. ఫుట్‌బాల్ , హాకీ, సాఫ్ట్‌బాల్, క్రికెట్, టెన్నిస్‌లో రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తున్నారు. ఇందులో మరీ ముఖ్యంగా ఫుట్‌బాల్ క్రీడను అభివృద్ధి పరిచేలా ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 28 క్లబ్‌లు ఏర్పాటు చేశారు.

అన్నీ ఉచితమే...

ప్రతిభ ఉండి అవకాశాలను అందిపుచ్చుకోలేని గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభ వెలికి తీసేందుకు అనంతపురం ఆర్డీటీ క్రీడాగ్రామాన్ని ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేసిన ఫుట్‌బాల్ క్లబ్‌లకు ఆరు నెలల పాటు పరస్పరం పోటీలు నిర్వహిస్తారు. ప్రతి వారం మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ చూపిన 40 మంది అబ్బాయిలు, 20 మంది అమ్మాయిలకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ కల్పిస్తారు. 10, 11, 12 సంవత్సరాల వయస్సు గల క్రీడాకారులను ఎంపిక చేస్తారు. డిగ్రీ, పీజీ వరకు ఉచితంగా చదువుతో పాటు రెసిడెన్షియల్ శిక్షణ కలిప్తారు. నయాపైసా ఫీజు వసూలు చేయరు. టోర్నమెంట్‌లకు వెళ్లేందుకు, తిరిగి వచ్చేందుకు ఖర్చులు సైతం ఆర్డీటీనే భరిస్తోంది. ఆరో తరగతిలో రెసిడెన్షియల్ అకాడమీలో చేరితే డిగ్రీ, పీజీ వరకు ఉచితంగా రెసిడెన్షియల్ విద్యను అందిస్తారు.

ఇప్పటి దాకా 2 వేల మందికి...

గ్రామీణ ప్రాంతాల్లో ఫుట్‌బాల్‌పై పెరుగుతున్న ఆసక్తి మేరకు విన్సెంట్ ఫెర్రర్ ఫౌండేషన్, రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ), లాలిగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళల ఫుట్‌బాల్ విభాగాన్ని ప్రోత్సహిస్తున్నారు. 7-15 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న 2 వేల మంది అమ్మాయిలు, అబ్బాయిలు ఇప్పటికే ఫుట్‌బాల్‌లో మెరుగైన క్రీడా నైపుణ్యాలు పెంపొందించుకున్నారు.

మహిళా ఫుట్‌బాల్‌కు ప్రోత్సాహం..

మహిళా ఫుట్‌బాల్‌ను ప్రోత్సహించేందుకు ఆర్డీటీ తరుపున అనంతపురం ఫుట్‌బాల్ లీగ్ (ఏఎఫ్ఎల్), సూపర్ లీగ్, మిక్స్-జెండర్ లీడ్ కప్ టోర్నీలను నిర్వహిస్తున్నారు. ఫుట్‌బాల్ ద్వారా లింగ సమానత్వాన్ని ప్రోత్సహించే టోర్నమెంట్ మిక్స్‌డ్ జెండర్ కప్. మహిళా ఫుట్‌బాల్‌పై ఆసక్తి ఏర్పరచుకునేలా స్పెయిన్ దేశానికి చెందిన ప్రతినిధులు ప్రత్యేక ఫౌండేషన్ లాలీగా ఏర్పాటు చేశారు.

జాతీయస్థాయిలో ప్రతిభ ..

జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు జాతీయస్థాయిలో ప్రతిభ చూపారు. రవి (ఆత్మకూరు), విష్ణువర్ధన్ (కళ్యాణదుర్గం), ప్రమిత్ (అనంతపురం) వీరసాయి (ఆత్మకూరు), ప్రమిత్ (కళ్యాణదుర్గం), మహబూబ్‌బాషా, దిలీప్, శ్రీహరి (గుత్తి), గౌతమి, మౌనిక (గుత్తి), శోభ, అంజలి, మీనాక్షి, ప్రవల్లిక (కళ్యాణదుర్గం), హేమశ్రీ, మౌనిక, ఆశాబీ, లక్ష్మీ (ఆత్మకూరు) దేశంలో వివిధ చోట్ల జరిగిన జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నారు.

తొలి మహిళా కోచ్‌గా గుర్తింపు



మనరాష్ట్రంలో తొలి మహిళా సీ లెసన్ కోచ్‌గా గుర్తింపు దక్కింది. డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుండగానే 2016లో లైసెన్సెడ్ కోచ్‌గా ఆర్డీటీ గుర్తింపు ఇచ్చింది. 2021లో హెడ్‌కోచ్‌గా గుర్తింపు పొందాను. 2023 జూలైలో జరిగిన ఇన్‌స్పైర్ కప్‌లో మనోళ్లు రెండో స్థానంలో నిలిచారు. అనూష, సంగీత, సాయి వర్షిత జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారు.

– అంజలి, ఫుట్‌బాల్ కోచ్

ఆనందంగా ఉంది



ఇక్కడి క్రీడాకారులకు పట్టుదల, అంకితభావంతో కృషి చేసే లక్షణాలు అధికంగా ఉన్నాయి. అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఆర్డీటీ 28 ఫుట్‌బాల్ క్లబ్‌లను ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. ముఖ్యంగా మహిళా ఫుట్‌బాల్‌ను అధికంగా ప్రోత్సహిస్తుండడం శుభదాయకం. తాజాగా నాలుగో దఫా అనంతపురంకు వచ్చాను. ఇక్కడ శిక్షణ ఇస్తున్న తీరు ప్రశంసనీయం.

– జోర్డి, స్పెయిన్ ఫుట్‌బాల్ కోచ్

క్రీడల్లోనూ సమానత్వం



క్రీడల్లో రాణించాలని 30 సంవత్సరాల క్రితం ఇక్కడ క్రీడా గ్రామాన్ని నెలకొల్పారు. అప్పటి కల ఇప్పుడు నెరవేరబోతోంది. క్రీడల్లోనూ సమానత్వం సాధించే దిశగా మహిళా ఫుట్‌బాల్‌ను ప్రోత్సహించడం అభినందనీయం. ఇక్కడికి వచ్చి ఫుట్‌బాల్ ఆడాలంటే చాలా ఇష్టం. అందుకే రెండు సంవత్సరాలకోసారి ఇక్కడికి వస్తుంటా.

– ఐనా, స్పెయిన్ ఫుట్‌బాల్ క్రీడాకారిణి

చాలా గర్వంగా ఉంది



ఆర్డీటీ స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ తీసుకుని జాతీయ , అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతున్న క్రీడాకారులను చూసి గర్వంగా ఉంది. ఇటీవలే భారత మహిళా క్రికెట్ టీంకు అనూష ప్రాతినిధ్యం వహించింది. ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ మరింత మంది క్రీడాకారులను ప్రోత్సహిస్తాం.

– మాంఛో ఫెర్రర్, ప్రోగ్రాం డైరెక్టర్, ఆర్డీటీ

బాలికల క్రికెట్ జట్టు ఎంపిక



జట్టులో స్థానం సంపాదించుకున్న క్రీడాకారులు

అనంతపురం: అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు వెంకటగిరిలో నిర్వహించే అండర్-15 బాలికల క్రికెట్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులను ఎంపిక చేశారు. ఆర్డీటీ క్రీడా గ్రామంలో శుక్రవారం ఎంపిక ప్రక్రియ జరిగింది.

ఎంపికైన వారు...

కే.గౌతమి (కెప్టెన్) అనంతపురం, బి.నందిని (వైస్ కెప్టెన్) అనంతపురం, బి. చాయాశ్రీ (అనంతపురం), పి. తేజ దీపిక (ధర్మవరం), పి.కార్తీక (హిందూపురం), పి. సుమయాతాజ్ (అనంతపురం), పి. నిత్యారెడ్డి (కదిరి), పి. రోష్ణ (అనంతపురం), ఏ. హాన్సిరెడ్డి (అనంతపురం) ,వీసీ రివ్య (గుత్తి) వై. శారద (కదిరి), బి. హిమవర్షిణి (అనంతపురం) , ఎస్. అంజుమ్ (అనంతపురం), జీఎస్ తేజశ్రీ (నార్పల), వి. కీర్తన (అనంతపురం) పి. షర్మాస్ వలీ (హెడ్ కోచ్), ఎస్. బిందు మాధవి (మేనేజర్)

ప్రాజెక్టులను విధ్వంసం చేసింది చంద్రబాబే

- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

అనంతపురం క్రైం: 'అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు జిల్లాలోని వివిధ ప్రాజెక్టులను విధ్వంసం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆ ప్రాజెక్టుల పనులను అధిక శాతం పూర్తిచేసి జీవం పోశారు. సీఎం వైఎస్ జగన్ హయాంలో గాలేరు నగరిని హంద్రీనీవాతో అనుసంధానం ప్రక్రియ ప్రారంభించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్, పోతిరెడ్డి పాడు సామర్థ్యం పెంచేలా, రాబోయే రోజుల్లో హంద్రీనీవా ప్రాజెక్టును పూర్తిగా జిల్లాకే ఉపయోగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది' అని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని పెంచేలా సీఎం వైఎస్ జగన్ రూ.వెయ్యి కోట్లతో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ కోసం కృషి చేశారన్నారు. టీడీపీ హయాంలో హంద్రీనీవాకు కేవలం 23 టీఎంసీల నీరు తీసుకొస్తే.. వైఎస్ జగన్ సీఎం అయినప్పటి నుంచి ఏటా 33 టీఎంసీలకుపైగా నీరు తీసుకువచ్చారన్నారు. చంద్రబాబు హయాంలో ఆత్మహత్యలకు కేంద్రంగా అనంతపురం నిలిచిందని, వ్యవసాయ సంక్షోభం తారాస్థాయికి చేరిందన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గ్రీన్ ట్రిబ్యూనల్ ద్వారా రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టుకు అడ్డుపడిన చరిత్ర టీడీపీదని మండిపడ్డారు. పోతిరెడ్డి హెడ్ రెగ్యులేటర్‌పైన రూపాయి ఖర్చు పెట్టకుండా రాయలసీమ ప్రాజెక్టుకు నీరు ఏవిధంగా తెస్తారో టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పాలన్నారు.

దొంగ ఓట్లపై కేశవ్ గగ్గోలు..

ఉరవకొండలో 7,500 దొంగ ఓట్లపై విచారణ చేయాలని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళితే ఉరవకొండ ఎమ్మెల్యే కేశవ్ గగ్గోలు పెడుతున్నారన్నారు. దొంగ ఓట్లతో గెలిచిన కేశవ్ రెవెన్యూ, తదితర అధికారులను బెదిరింపులకు గురి చేసేలా వ్యవహరిస్తున్నారన్నారు. పయ్యావుల కేశవ్‌కు ధైర్యముంటే విచారణకు సహకరించాలన్నారు. కదిరిలో చంద్రబాబు వైనాట్ 175 అని అన్నారని, కనీసం కుప్పంలో ఆయన గెలిచే పరిస్థితి లేదన్నారు.

పారా బ్యాడ్మింటన్ టోర్నీకి ఎంపిక

అనంతపురం: 6వ పారా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ -2023 ఈ నెల 15న విశాఖలో నిర్వహించనున్నారు. ఇందులో ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ అనంతపురం కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. వివిధ కేటగిరిలో 12 మంది క్రీడాకారులు ఎంపిక చేశామన్నారు.

ఎంపికైన వారు..

ఉమాపతి మహేష్ కుమార్ (ఎస్ఎల్ -4), వై. గౌతమి (ఎస్‌యూ-5), ఎం. సతీష్ కుమార్ (ఎస్-3) వీఏజీ వన్నూర్ స్వామి (ఎస్ఎల్-3), ఆర్. భార్గవి (ఎస్‌యూ-5) సి. తరుణ్ (ఎస్‌యూ-5), కే.లక్ష్మి కుమార్ (ఎస్ఎల్-4), ఎం. అభిషేక్ (ఎస్ఎల్-3), ఏ. బాబయ్య(ఎస్ఎల్-4) ఆర్. నాగరాజు (డబ్ల్యూహెచ్-2), ఎన .శ్రీనివాసులు (డబ్ల్యూ హెచ్-2), గాలి నందకుమార్ రెడ్డి (ఎస్ఎల్-3).

అనుమతులు లేని ఎరువుల సీజ్



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ వెంకటరాముడు

శింగనమల: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం జిల్లాలో పలు ఫర్టిలైజర్‌షాపులపై దాడులు నిర్వహించారు. శింగనమల మండలం నాయనపల్లిక్రాస్‌లోని శ్రీలక్ష్మి ఆగ్రోస్ ఏజెన్సీలో అనుమతులు లేని రూ.59,700 విలువ చేసే ఎరువులను గుర్తించి సీజ్ చేశారు. అనంతరం గుత్తి ఏడీఏ వెంకటరాముడు విలేకరులతో మాట్లాడుతూ అనుమతులు లేని ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. స్టాక్ రిజిష్టర్ ఎప్పటికప్పడు అప్‌డేట్ చేయాలని, ఫారం ఎన్ ప్రకారం ఎరువులు రిజిష్టర్‌లో నమోదై ఉండాలని, అదికూడా ఈ-పోస్ మిషన్ ద్వారా అమ్మకాలు జరపాలన్నారు. జీఎస్టీ, లైసెన్స్‌లలో ఉన్న సేల్స్, గోడౌన్‌లలో మాత్రమే అమ్మకాలు జరపాలన్నారు. పురుగు మందులు, ఎరువులు, విత్తనాలకు వేరువేరు బిల్ బుక్కులు ఉండాలన్నారు. ఆయన వెంట ఏఓ ఆన్వేష్ కుమార్, కృష్ణ భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

ఏడు రకాల ఎరువుల సీజ్

గుంతకల్లు రూరల్: గుంతకల్లు పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో లైసెన్స్ లేకుండా విక్రయిస్తున్న ఏడు రకాల ఎరువులను సీజ్ చేసినట్లు ఏఓ స్వాతి తెలిపారు. విజిలెన్స్ ఏఓ వాసు ప్రకాష్, ఎస్‌ఐ ఫణీంద్ర, అగ్రికల్చర్ ఆఫీసర్ స్వాతి శుక్రవారం కాశీ విశ్వేశ్వర ఫర్టిలైజర్స్, గణేష్ ఫర్టిలైజర్స్, సుదర్శన్ కెమికల్స్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. కాశీ విశ్వేశ్వర ఫర్టిలైజర్ షాపులో జీ.03 లైసెన్స్ లేకుండా విక్రయిస్తున్న ఐదు రకాల ఎరువులను, గణేష్ ఫర్టిలైజర్ షాపులో రెండు రకాల ఎరువులను సీజ్ చేసి, వారిపై 6ఏ కింద కేసు నమోదు చేసిశారు.

ఆర్ఓలు, ఏఆర్ఓల నియామకం

అనంతపురం అర్బన్: సాధారణ ఎన్నికల నిర్వహణకు అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓ), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల (ఏఆర్ఓ)ను నియమించారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం గెజిట్ జారీ చేసింది. అదే విధంగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ నిర్వహణకు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓ), అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులను (ఏఈఆర్ఓ) నియమించారు.

నియోజకవర్గాల వారీగా ఆర్ఓలు, ఏఆర్ఓల నియామకం..

రాయదుర్గం ఆర్ఓగా అన్‌సెట్ సీఈఓ, ఏఆర్ఓలుగా రాయదుర్గం, కణేకల్లు, బొమ్మనహాళ్, గుమ్మఘట్ట తహసీల్దార్లు, ఉరవకొండ ఆర్ఓగా జాయింట్ కలెక్టర్, ఏఆర్ఓలుగా ఉరవకొండ, కూడేరు, వజ్రకరూరు, విడపనకల్లు, బెళుగుప్ప తహసీల్దార్లు నియమితులయ్యారు. గుంతకల్లు ఆర్ఓగా ఆర్డీఓ, ఏఆర్ఓలుగా గుంతకల్లు, గుత్తి, పామిడి తహసీల్దార్లు, తాడిపత్రి ఆర్ఓగా ఎస్‌డీసీ(ఎల్ఏ) పీఏబీఆర్, ఏఆర్ఓలుగా తాడిపత్రి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు, యాడికి తహసీల్దార్లను నియమించారు. శింగనమల ఆర్ఓగా ఎస్‌డీసీ (ఎల్ఏ) హెచ్ఎన్ఎస్ఎస్-2, ఏఆర్ఓలుగా శింగనమల, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, యల్లనూరు తహసీల్దార్లు, అనంతపురం అర్బన్ ఆర్ఓగా ఆర్డీఓ, ఏఆర్ఓలుగా అనంతపురం తహసీల్దార్, స్పెషల్ తహసీల్దారు (ఎల్ఆర్) నియమితులయ్యారు. కళ్యాణదుర్గం ఆర్ఓగా ఆర్డీఓ, ఏఆర్ఓలుగా కళ్యాణదుర్గం, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కుందుర్పి, కంబదూరు తహసీల్దార్లు, రాప్తాడు ఆర్ఓగా ఎస్‌డీసీ, హెచ్చెల్సీ, ఏఆర్ఓలుగా రాప్తాడు, ఆత్మకూరు, కనగానపల్లి, సీకేపల్లి, రామగిరి తహసీల్దార్లను నియమించారు.

ఈఆర్ఓ, ఏఈఆర్ఓలుగా...

రాయదుర్గం నియోజకవర్గానికి ఈఆర్ఓగా జిల్లా యువజన సంక్షేమ అధికారి, ఏఈఆర్ఓలుగా రాయదుర్గం, కణేకల్లు, బొమ్మనహాళ్, గుమ్మఘట్ట తహసీల్దార్లు, రాయదుర్గం మునిసిపల్ కమిషనర్, ఉరవకొండ నియోజకవర్గ ఈఆర్ఓగా ఎస్‌డీసీ, కేఆర్ఆర్‌సీ, ఏఈఆర్ఓలుగా ఉరవకొండ, కూడేరు, వజ్రకరూరు, విడపనకల్లు, బెళుగుప్ప తహసీల్దార్లు నియమితులయ్యారు. గుంతకల్లు ఈఆర్ఓగా ఆర్డీఓ, ఏఈఆర్ఓలుగా గుంతకల్లు, గుత్తి, పామిడి తహసీల్దార్లు, గుంతకల్లు, గుత్తి మునిసిపల్ కమిషనర్లను నియమించారు. తాడిపత్రి నియోజకవర్గానికి ఈఆర్ఓగా ఎస్‌డీసీ (ఎల్ఏ) పీఏబీఆర్, ఏఈఆర్ఓలుగా తాడిపత్రి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు, యాడికి తహసీల్దార్లు, తాడిపత్రి మునిసిపల్ కమిషనర్ నియమితులయ్యారు. శింగనమల నియోజకవర్గానికి ఈఆర్ఓగా ఎస్‌డీసీ (ఎల్ఏ) హెచ్ఎన్ఎస్ఎస్-2, ఏఈఆర్ఓలుగా శింగనమల, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, యల్లనూరు తహసీల్దార్లను నియమించారు. అనంతపురం అర్బన్‌కు ఆర్ఓగా ఆర్డీఓ, ఏఈఆర్ఓలుగా అనంతపురం తహసీల్దారు, స్పెషల్ తహసీల్దారు (ఎల్ఆర్) అనంతపురం, కమిషనర్, డిప్యూటీ కమిషనర్ (నగర పాలక సంస్థ), డీఏఓ నియమితులయ్యారు. కళ్యాణదుర్గం ఈఆర్ఓగా ఆర్డీఓ, ఏఈఆర్ఓలుగా కళ్యాణదుర్గం, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కుందుర్పి, కంబదూరు తహసీల్దార్లతో పాటు కళ్యాణదుర్గం మునిసిపల్ కమిషనర్‌ను నియమించారు. రాప్తాడుకు ఈఆర్ఓగా ఎస్‌డీసీ, హెచ్చెల్సీ, ఏఈఆర్ఓలుగా రాప్తాడు, ఆత్మకూరు, కనగానపల్లి, సీకేపల్లి, రామగిరి తహసీల్దార్లు, అనంతపురం, రాప్తాడు ఎంపీడీఓలు నియమితులయ్యారు.

రాష్ట్రస్థాయి కవితల పోటీలు

అనంతపురం కల్చరల్: భారతీయ కళావేదిక సంస్కార భారతి ఆధ్వర్యంలో దేశ స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా యువతీ యువకులకు కవితా పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు సంస్కార భారతి ప్రతినిధులు రామ్‌కుమార్, లక్ష్మీ ఓ ప్రకటనలో వివరాలు తెలిపారు. 'స్వాతంత్ర్య పోరాటంలో యువత పాత్ర ' అనే అంశంపై కవితలు ఈనెల 10లోపు పంపాలన్నారు. ఎంపికై న కవితలకు ప్రోత్సాహక బహుమతులుంటాయని పేర్కొన్నారు. కవితలు పంపే వారు తప్పనిసరిగా ఏదో ఒక కళాశాల లేదా యూనివర్సిటీ చదువుతుండాలని, మరిన్ని వివరాలకు 9848035573 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

గురుకుల పాఠశాలలో అక్రమాల గుర్తింపు



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్‌రెడ్డి

వజ్రకరూరు: మంల పరిధిలోని రాగులపాడులోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో అక్రమాలను అధికారులు గుర్తించారు. శుక్రవారం స్టేట్ ట్రైబల్ గురుకులం డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్ రెడ్డి రాగులపాడుకు చేరుకుని గిరిజన గురుకుల పాఠశాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న పలు రికార్డులను తనిఖీలు నిర్వహించి కొన్నింటిని సీజ్ చేశారు. అడ్మిషన్లలో నిబంధనలు పాటించలేదని, స్టాక్ రిజిస్టర్‌తో పాటు ఈ-రికార్డు, మ్యాన్యువల్ రికార్డు, ప్రొవిజన్ రికార్డు తదితర వాటిని సక్రమంగా నిర్వహించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ చార్ట్‌ను ఏర్పాటు చేయపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో జరిగిన అవకతవకలపై ప్రిన్సిపల్ సెక్రటరీకి నివేదిక అందించనున్నట్లు డిప్యూటీ సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

కలెక్టరేట్ సుందరీకరణ



కార్యాలయానికి రంగులు వేస్తున్న పెయింటర్లు

అనంతపురం అర్బన్: పంద్రాగస్టు సందర్భంగా కలెక్టర్ కార్యాలయ సుందరీకరణ పనులు ఊపందుకున్నాయి. భవనానికి పెయింటింగ్ పనులు జరుగుతున్నాయి. ఆవరణలో ఫెన్సింగ్ పనులు పూర్తిచేశారు. కార్యాలయం ఎదురుగా ఉన్న ఐలాండ్‌లో, రోడ్లకు ఇరువైపులా పచ్చిక ఏర్పాటు చేస్తున్నారు. కార్యాలయం వెనుక, ఆవరణలో క్రమపద్ధతిలో చెట్ల కొమ్మల తొలగింపు పనులు జరుగుతున్నాయి. పనులను అసిస్టెంట్ కలెక్టర్ కుశాల్‌జైన్ నేతృత్వంలో పరిపాలనాధికారి శ్రీధర్ పర్యవేక్షిస్తున్నారు.

పీఏబీఆర్‌కు చేరిన తుంగభద్ర జలాలు



పీఏబీఆర్‌లోకి ప్రవహిస్తున్న నీరు

కూడేరు: మండల పరిధిలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)కు హెచ్చెల్సీ ద్వారా తుంగభద్ర జలాలు శుక్రవారం చేరాయి. రిజర్వాయర్‌లోకి సరఫరావుతున్న నీటిని ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసులు, డీఈఈ గురవయ్య, ఏఈఈలు లక్ష్మీదేవి, గంగమ్మ, ఫాతిమా పరిశీలించారు. తొలిరోజు 386 క్యూసెక్కుల చొప్పున నీరు వచ్చినట్లు ఈఈ తెలిపారు.

భవనంపై నుంచి జారిపడి బేల్దారి మృతి



శ్రీనివాసులు (ఫైల్)

రాయదుర్గంటౌన్: పని చేస్తూ భవనపై నుంచి పడి ఓ నిర్మాణ కార్మికుడు మృతి చెందిన ఘటన రాయదుర్గం పట్టణంలోని ఓబుళాచారీ రోడ్డు దండు మారెమ్మ గుడి సమీపంలో జరిగింది శుక్రవారం జరిగింది. పట్టణంలోని 22వ వార్డు అంబేడ్కర్ ఫస్ట్ క్రాస్‌లో నివాసం ఉంటున్న సిద్ధేశ్వర కుమారుడు శ్రీనివాసులు (23) దండుమారెమ్మ గుడి సమీపంలో ఓ కొత్త భవన నిర్మాణంలో భాగంగా బేల్దారి పనికి వెళ్లాడు. అయితే పై అంతస్తులో పనిచేస్తుండగా శ్రీనివాసులు కాలు జారీ పడటంతో తలకు తీవ్రమైన రక్తగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యులు బళ్లారి విమ్స్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శ్రీనివాసులు మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

రైల్లో నుంచి జారిపడి...



ఈశ్వర్‌రెడ్డి(ఫైల్)

బత్తలపల్లి: రైలులో ప్రయాణిస్తున్న వ్యక్తి కాలు జారి కిందపడి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాలు మేరకు... మండలంలోని రాఘవంపల్లికి చెందిన బి.ఈశ్వర్‌రెడ్డి (52) తిరుపతిలో ఉన్న వ్యానును తీసుకువచ్చేందుకు రైలులో వెళ్తున్నాడు. రైలు మదనపల్లి సీటీఎం రైల్వే స్టేషన్ దగ్గర రైలు దిగి ఎక్కే సమయంలో కాలు జారి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య కాంతమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మదనపల్లి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

ఫార్మసిస్టుల పాత్ర కీలకం



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం: రోగులను కాపాడడంలో డాక్టర్లతో పాటు ఫార్మసిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని జేఎన్‌టీయూ అనంతపురం రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఈశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాఘవేంద్ర ఫార్మసీ కళాశాల (రైపర్)లో ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ ఫార్మాకో ఎకనామిక్స్ అండ్ అవుట్‌కమ్ రీసెర్చ్ (ఐఎస్‌పీఓఆర్) ఇండియా, ఆంధ్రప్రదేశ్ రీజనల్ చాప్టర్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు హెల్త్ ఎకనామిక్స్ అండ అవుట్ కమ్ రీసెర్చ్ అనే అంశంపై జాతీయ సదస్సు ప్రారంభించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఫార్మా రంగంలో పరిశోధనా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐపీఏ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ టీవీ నారాయణ, సదస్సు కన్వీనర్ డాక్టర్ ప్రదీప్ కుమార్, డాక్టర్ సుధీర్, రైపర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై. పద్మనాభ రెడ్డి, కరస్పాండెంట్ డాక్టర్ జీ. రవీంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అనంత'కు చేరిన షేక్ జిలాన్ పాదయాత్ర



షేక్ జిలాన్‌ను శాలువతో సత్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన షేక్ జిలాన్ చేపట్టిన పాదయాత్ర అనంతపురానికి శుక్రవారం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ జిలాన్‌కు స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువతో సత్కరించారు. మార్కాపురం నుంచి ఇచ్ఛాపురం వరకు సుమారు 4,200 కిలోమీటర్ల మేర సుదీర్ఘ పాదయాత్ర చేపట్టానని జిలాన్ తెలిపారు. ఇప్పటి వరకు 508 కిలోమీటర్ల యాత్ర పూర్తయ్యిందన్నారు. 'మీ సంకల్పం మంచిది. దేవుడి ఆశీస్సులు, రాష్ట్ర ప్రజల దీవెనలతో మళ్లీ వైఎస్ జగనన్నే సీఎం అవుతారని' ఆమె ఆకాంక్షించారు.

హౌసింగ్ ఏఈగా సాయి పవన్

రాప్తాడు: రాప్తాడు మండల హౌసింగ్ ఏఈగా సాయిపవన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఏఈ దేవరకొండ రామ్మూర్తి రాప్తాడు సబ్ డివిజన్ హౌసింగ్ డీఈగా పదోన్నతిపై అనంతపురానికి వెళ్లారు. అనంతపురం ఏఈ రాప్తాడుకు బదిలీపై వచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణ పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయించి పేదల సొంతింటి కల నెరవేరుస్తామన్నారు.

పింగళి వెంకయ్య పేరిట పథకం ప్రవేశపెట్టాలి



లోక్‌సభలో మాట్లాడుతున్న ఎంపీ రంగయ్య

అనంతపురం క్రైం: స్వాతంత్య్ర సమరయోధుడు, జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య పేరుపై పట్టణ, నగర ప్రాంతాల్లోని ప్రజలకు ఉపాధి పథకం ప్రవేశపెట్టాలని ఎంపీ తలారి రంగయ్య లోక్‌సభ స్పీకర్‌ను విన్నవించారు. శుక్రవారం లోక్‌సభలో ఎంపీ తలారి రంగయ్య మాట్లాడారు. ఉపాధి కల్పనలో భాగంగా నూతన జాతీయ పథకాన్ని అమలు చేయాలని ప్రైవేట్ బిల్లును ఆయన ప్రవేశపెట్టారు.

జర్నలిస్టు కాలనీలో అభివృద్ధి పనులు



భూమిపూజలో పాల్గొన్న మచ్చా రామలింగారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చియ్యేడు కృష్ణారెడ్డి

రాప్తాడురూరల్: రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కలెక్టర్ గౌతమి కృషితో అనంతపురం రూరల్ మండలం కొడిమి జర్నలిస్ట్‌కాలనీలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా డ్రైనేజీ, సిమెంట్ రోడ్డు పనులకు శుక్రవారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఏపీడబ్ల్యూజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి, అనంతపురం రూరల్ మండల ఉపాధ్యక్షులు చియ్యేడు కృష్ణారెడ్డి భూమిపూజ చేసి, పనులు ప్రారంభించారు. మచ్చా రామలింగారెడ్డి మాట్లాడుతూ కొడిమి జర్నలిస్టు కాలనీలో అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, కృషి చేసిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, కలెక్టర్ గౌతమికి ధన్యవాదాలు తెలిపారు. వైస్ ఎంపీపీ చియ్యేడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టు కాలనీ అభివృద్ధికి ఎప్పుడూ తమవంతు సహకారం ఉంటుందన్నారు. కాలనీ సొసైటీ కార్యదర్శి విజయరాజు, పాత్రికేయులు హరికృష్ణ, నాయక్, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'సంపూర్ణ పోషణ'తో ఆరోగ్యమస్తు



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లతో ఎంపీపీ వరలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: వైఎస్సార్ సంపూర్ణ పోషణతోనే గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అనంతపురం రూరల్ ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వం పోషక విలువలతో కూడిన 10 రకాల ఆహారాల కిట్లు అందిస్తోందన్నారు. శుక్రవారం అనంతపురం రూరల్ మండలం ఎ.నారాయణపురం పంచాయతీ పరిధిలోని విద్యారణ్యనగర్–1,2,3,4, బిందెలకాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ' కిట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ వరలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు దూరంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి మధ్యాహ్న భోజనం తినడానికి ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం సంపూర్ణ పోషకాహారం ఇంటివద్దకే తీసుకెళ్లేలా చర్యలు తీసుకుందన్నారు. బియ్యం, కందిపప్పు, నూనె, పాలు, కోడిగుడ్లు, ఖర్జూరం , వేరుశనగ చిక్కీ , రాగిపిండి, బెల్లం, అటుకులతో కూడిన కిట్ అందిస్తోందన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టికాహారం, ఇతర సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కురుబ వెంకటేశ్వర్లు, సందీప్ యాదవ్ , అంగన్‌వాడీ కార్యకర్తలు అరుణ, హెచ్.లక్ష్మిదేవి, మాధవి, గౌతమి, చంద్రకళ, ఏఎన్‌ఎంలు సరస్వతి, లక్ష్మి, మహిళా పోలీస్ హరిత తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఆత్మకూరు: పౌష్టికాహారంతోనే గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వైస్ ఎంపీపీ నీలిమ తెలిపారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరోగ్యం రెడ్డి పాల్గొన్నారు.

పరిశోధనలతో నూతన ఆవిష్కరణలు

- ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి

అనంతపురం క్రైం: పరిశోధనల ద్వారా నూతన ఆవిష్కరణకు ఆస్కారం ఉంటుందని, తద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించొచ్చని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి పేర్కొన్నారు. కళాశాలలోని 2020 బ్యాచ్‌కు చెందిన ఐదుగురు వైద్య విద్యార్థులు 2022లో చేసిన పరిశోధనలకు యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ బాబ్జీ ఒక్కొక్కరికి రూ.10వేలు నగదు ప్రకటించారు. శుక్రవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులు షేక్ అహద్ ముబారక్, తెలుగుసాయి యశ్వంత్, సోరపు రుద్రప్రయాగ్, సిద్ధి వెంకట రమాదేవి, మహమ్మద్ సిఫారత్ నిషాన్‌లకు ప్రిన్సిపాల్ చెక్కులు అందించారు. విద్యార్థులను గైడ్ చేసిన రీసెర్చ్ ప్రొఫెసర్లు డాక్టర్ షారోన్ సోనియా, డాక్టర్ మధుసూదన్, డాక్టర్ నిహారిక, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ శ్రీనివాసరావును సన్మానించారు. కార్యక్రమంలో జీవ రసాయన శాస్త్ర విభాగపు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బీఆర్ శ్యాంప్రసాద్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన డీసీసీబీ చైర్‌పర్సన్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేపాక్షి నంది విగ్రహాన్ని అందిస్తున్న ఎం.లిఖిత, పామిడి వీరా

అనంతపురం అగ్రికల్చర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్‌పర్సన్ ఎం.లిఖిత, మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు కలిశారు. శుక్రవారం విజయవాడ ఏ–కన్వెన్షన్ హాలులో రాష్ట్ర సహకార బ్యాంకు (ఆప్కాబ్) వజ్రోత్సవాలు ఘనంగా జరిగాయి. వజ్రోత్సవాలకు 'అనంత' డీసీసీబీ తరఫున చైర్‌పర్సన్ ఎం.లిఖిత, మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులుతో పాటు డైరెక్టర్లు, పలువురు అధికారులు, విశ్రాంత అధికారులు హాజరయ్యారని డీసీసీబీ సీఈవో ఏబీ రామ్‌ప్రసాద్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చైర్‌పర్సన్ కలిసి జిల్లా అభివృద్ధికి, డీసీసీబీ అభివృద్ధికి మరింత తోడ్పాటును అందించాలని కోరినట్లు తెలిపారు.

విధివంచితులు



మృతి చెందిన దంపతులు మంజుల, నాగార్జున (ఫైల్)



అనాథలైన చిన్నారులు

- రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి
- అనాథలైన ముగ్గురు చిన్నారులు

బత్తలపల్లి: రోడ్డు ప్రమాదం ఓ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. అన్యం పుణ్యం తెలీని చిన్నారులను అనాథలుగా మార్చేసింది. అనంతపురం పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో నాగార్జున, మంజుల దంపతులు నివాసముంటున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు (విష్ణుప్రియ (7), హరిప్రియ (5), మధుప్రియ (3)) సంతానం. దంపతులిద్దరూ బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గత శనివారం మంజుల మేనత్త మృతి చెందినట్లు సమాచారం అందడంతో తనకల్లు మండలం సీఆర్ పల్లికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. గుమ్మల్లకుంట వద్ద ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీ కొంది. తీవ్రంగా గాయపడిన మంజుల (30), నాగార్జున (34)లను కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంజుల మంగళవారం మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే చికిత్స పొందుతూ నాగార్జున కూడా శుక్రవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. దీంతో వారి ముగ్గురు బిడ్డలు అనాథలయ్యారు. జరిగింది అర్థం కాక అమ్మానాన్న ఎక్కడున్నారు? ఎప్పుడొస్తారు? అని అడుగుతున్నారని బంధువులు కన్నీరు మున్నీరవుతున్నారు.

నిర్ణీత సమయంలో ఓటరు సర్వే పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ మధుసూదన్

అనంతపురం క్రైం: ఈ నెల 21లోపు ఇంటింటా ఓటరు సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆర్‌డీఓ మధుసూదన్ బీఎల్‌ఓలను ఆదేశించారు. శుక్రవారం నగర పాలక సంస్థలో 153 అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఏఈఆర్‌ఓ, బీఎల్‌ఓలతో ఆయన సమావేశమయ్యారు. ఆర్‌డీఓ మాట్లాడుతూ ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఉంటే వారిని ఒకే పోలింగ్ కేంద్రంలోకి తీసుకురావాలన్నారు. ఎన్నికల విధుల్లో ఎక్కడా వలంటీర్‌ను వినియోగించరాదన్నారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలకు సంబంధం లేని డోర్ నంబర్లు ఉన్నట్లుంటే వాటిని సంబంధిత పోలింగ్ బీఎల్‌ఓతో మాట్లాడుకొని సరిదిద్దుకునేందుకు ఫాం 8 పూర్తి చేయాలన్నారు. రాజకీయ నాయకులు ఏ పీఎస్‌కు ఎవరిని ఏజెంట్‌గా ప్రతిపాదించారో వారు మాత్రమే బీఎల్‌ఓలతో వెళ్లాన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, కలెక్టరేట్ ల్యాండ్ అండ్ రిఫార్మ్స్ తహసీల్దార్ విశ్వనాథ్, అదనపు కమిషనర్ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: అభివృద్ధి పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని మేయర్ వసీం అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని 48వ డివిజన్ ఆర్కేనగర్‌లో రూ.48 లక్షలతో చేపడుతున్న ఇందిరాగాంధీ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులు మేయర్ పరిశీలించారు. కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ పాఠశాలలను తీర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని మేయర్ అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజలు పడిన ఇబ్బందులను గుర్తు చేసుకోవాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని, చిన్నసమస్యను కూడా టీడీపీ నాయకులు బూతద్దంలో చూపిస్తున్నారన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా, ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిపై నగర ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తారన్నారు. కార్పొరేటర్లు శ్రీనివాసులు, కమల్ భూషణ్, డీఈ దాక్షయణి, ప్రసన్నలక్ష్మి, నాయకులు ఖాజా తదితరులు పాల్గొన్నారు.

అదనపు సెలవుల మంజూరుపై స్టాఫ్‌నర్సుల హర్షం



సూపరింటెండెంట్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న స్టాఫ్ నర్సులు

అనంతపురం క్రైం: అదనపు సెలవుల మంజూరుపై ప్రభుత్వ సర్వజనాస్పత్రి స్టాఫ్‌నర్సులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 11న వివిధ శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు మరో ఐదు రోజులు అదనపు సెలవులను మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ జీవో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని నర్సింగ్ సూపరింటెండెంట్లు మంజు (గ్రేడ్ 1), రజిని (గ్రేడ్–2), స్టాఫ్‌నర్సు అసోసియేషన్ నాయకురాలు చాముండేశ్వరి ఇటీవల సూపరింటెండెంట్‌ను కోరారు. శుక్రవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సూపరింటెండెంట్ కేఎస్‌ఎస్ వెంకటేశ్వరరావుకు స్టాఫ్‌నర్సులు ధన్యవాదాలు తెలిపా రు. హెడ్‌నర్సులు ఉమాదేవి, లత, వసంతబాయి, కౌసల్య, ఆదిలక్ష్మి, స్టాఫ్‌నర్సులు గీతామాధురి, అంజనమ్మ, తిప్పే రుద్రమ్మ, సురేఖ, పద్మ, సుజాత, నిర్మల పాల్గొన్నారు.

తల్లిపాల విశిష్టతను తెలియజేయాలి: సర్వజనాస్పత్రిలోని చిన్నపిల్లలవార్డులో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. రేడియాలజీ విభాగం ఇన్‌చార్జ్ డాక్టర్ మనోరంజన్ రెడ్డి ఎక్స్‌రే క్యాస్కెట్ల కొరత విషయాన్ని సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లారు. చిన్నపిల్లల విభాగాధిపతి రవికుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ ప్రవీణ్‌దీన్‌కుమార్, వైద్యులు డాక్టర్ ప్రత్యూష, స్టాఫ్‌నర్సులు లత, కీర్తి, పెద్దక్క పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం చేయండి



కలెక్టర్ గౌతమితో 'మానవత' సంస్థ ప్రతినిధులు

అనంతపురం అర్బన్: సామాజిక సేవ కార్యక్రమాలు విస్తృతం చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు సూచించారు. కలెక్టర్‌ను కలెక్టరేట్‌లో సంస్థ ప్రతినిధులు రిటైర్డ్ డీఆర్‌ఓ రఘునాథ్‌రావు, రిటైర్డ్ తహసీల్దారు జయరామప్ప, తదితరులు శుక్రవారం కలిసి మాట్లాడారు.

మాన్యం భూములు ఆక్రమిస్తే చర్యలు

అనంతపురం కల్చరల్: దేవుడి మాన్యాన్ని ఆక్రమిస్తే ఎవరినైనా వదిలేది లేదని ఎండోమెంట్ అధికారులు స్పష్టం చేశారు. శుక్రవారం నగర శివార్లలోని టీవీటవర్ సమీపంలోని దేవుడి మాన్యంలో ఆక్రమణలు తొలగించడానికి ఎండోమెంటు సిబ్బంది ప్రయత్నించారు. వివరాలు.. ఉప్పరపల్లి ఆంజనేయస్వామి ఆలయ మాన్యం టీవీటవర్ సమీపంలోని లెనిన్ నగర్‌లో ఉంది. అందులో 6 ఎకరాలా 50 సెంట్ల దేవుడి మాన్యాన్ని చర్మకారుల సంఘం పేరిట ఆక్రమించి, 150కి పైగా ఇళ్లు నిర్మించారని, ఇంకా రేకుల షెడ్లు, గుడిసెలు వేసుకున్నారని ఈవో రామాంజనేయులు అన్నారు. కోర్టు కూడా ఎండోమెంట్ శాఖకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని, ఆక్రమణల విషయంలో ప్రభుత్వం కఠినంగా ఉందన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీ గణపతి హోమం

అనంతపురం కల్చరల్: విఘ్నాలు తొలగించే వినాయకుడికి ప్రీతిపాత్రమైన సహస్ర మోదక శ్రీలక్ష్మీ మహాగణపతి హోమం శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. సంకష్టహర చతుర్థి పర్వదినం కలిసి రావడంతో స్థానిక గీతామందిరం అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. అంతకు ముందు గణపతికి విశేష పుష్పాలంకారంతో పాటు రుద్రాభిషేకాలు, అర్చనలు చేశారు. సోమనాథనగర్‌లోని సంకష్టహర వినాయక ఆలయంలో అర్చకులు దేవరకొండ వెంకట రమేష్ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుడి వ్రత విధానం చేశారు. మూడోరోడ్డు బాబా మందిరంలో సంకష్టహర చతుర్థి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి.

పోలీసుశాఖ ప్రతిష్ట పెంచేలా సేవలు



హాజరైన ట్రైనీ డీఎస్పీలు



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: పోలీసుశాఖ ప్రతిష్ట పెంచేలా సేవలు అందించాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ పోలీసు అకాడమీ, అనంతపురంలో శిక్షణ పొందుతున్న ట్రైనీ డీఎస్పీలతో ఆయన ముఖాముఖి సమావేశమయ్యారు. ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో పోలీసుల పాత్ర కీలకమైనదన్నారు. చిన్న చిన్న సమస్యల పరిష్కారం మొదలు ప్రకృతి వైపరీత్యాల వరకూ పోలీసులు పని చేయాల్సి ఉంటుందన్నారు. పోలీసుశాఖ ప్రతిష్ట పెంపొందిస్తూనే ప్రజలతో మమేకమై మెరుగైన సేవలు అందించాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ పారదర్శకత, నిజాయితీ, క్రమశిక్షణలతో మెలగాలన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకూడదన్నారు. పిటీషనర్ల పట్ల గౌరవంగా వ్యవహరించాలన్నారు. నేరాలు జరగకుండా ప్రివెన్షన్, డిటెక్షన్ల కోసం అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, చట్టాలను ఉపయోగించి నేరాలు తగ్గేందుకు కృషి చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో అవినీతి అక్రమాలకు మొగ్గు చూపకూడదని హితవు పలికారు. డీఎస్పీ జె.మల్లికార్జునవర్మ, ట్రైనీ డీఎస్పీలు, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికత అందిపుచ్చుకోవాలి

- ఇస్రో శాస్త్రవేత్త మురళీధర్



మాట్లాడుతున్న ఇస్రో శాస్త్రవేత్త మురళీధర్

రాప్తాడురూరల్: ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఇస్రో శాస్త్రవేత్త, డిప్యూటీ జనరల్ మేనేజర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ సి.మురళీధర్ సూచించారు. శుక్రవారం అనంతపురం రూరల్ మండలం తాటిచెర్ల ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మురళీకృష్ణ మాట్లాడుతూ శ్రీహరికోట షార్ సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్ నుంచి అనేక కృత్రిమ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపామన్నారు. గత నెల 14న రూ. 650 కోట్లతో చంద్రయాన్–3 రాకెట్‌ను చంద్రుడి మీదకి పంపినట్లు తెలిపారు. ప్రపంచంలో ఎవ్వరూ చంద్రుడి దక్షిణ ధృవం వైపు ఉపగ్రహాన్ని పంపలేదన్నారు. మొదటిసారిగా ఇండియా నుంచి దక్షిణ ధృవం వైపు ఉపగ్రహాన్ని పంపామన్నారు. ప్రస్తుతం అది చంద్రుడి కక్షలోకి ప్రవేశించిందన్నారు. చంద్రయాన్–3 సక్సెస్ అయిన తర్వాత దాదాపు రూ. 2 వేల కోట్ల ఆదాయం వివిధ దేశాల నుంచి వస్తుందన్నారు. ఈ నెలాఖరు లేదా సెప్టెంబర్ మొదటి వారంలో పీఎస్ఎల్వీ–57 రాకెట్ ద్వారా ఆదిత్య ఎల్‌వన్ ఉపగ్రహాన్ని భూమి నుంచి 15 వేల కిలోమీటర్ల ఎత్తుకు పంపనున్నట్లు తెలిపారు. ఉపగ్రహాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం మురళీధర్ పాఠశాలకు చంద్రయాన్–3 రాకెట్ నమూనాను బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావ్ కుమార్, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పి. అశోక్ కుమార్‌రెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎస్‌టీయూఏపీ నాయకులు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సూర్యుడు, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి మాట్లాడారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, రామాంజనేయులు, సూర్యనారాయణగౌడ్, ఫణిభూషణ్, రాజశేఖర్, ఆనంద రెడ్డి, రవి, కిషోర్ పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

రాప్తాడు: దళితుడిపై దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి తెలిపారు. డీఎస్పీ మాట్లాడుతూ గత నెల 31న అయ్యవారిపల్లిలో మొహర్రం వేడుకల్లో హరిజన కుమార్‌పై అదే గ్రామానికి చెందిన జోగి ఎర్రిస్వామి కొడవలితో దాడి చేసి, గాయపరిచాడు. బాధితుడు కుమార్ భార్య నాగమణి ఫిర్యాదు మేరకు జోగి ఎర్రిస్వామిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

రాచానపల్లిలో పెట్రోల్ దొంగ

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లిలో పెట్రోల్ దొంగ పడ్డాడు. అర్ధరాత్రి పలు బైకుల నుంచి పెట్రోల్ ఎత్తుకెళ్లాడు. పెట్రోల్ చోరీ చేస్తున్న వ్యవహారం రూట్స్ స్కూల్ సమీపంలోని ఓ ఇంటివద్ద సీసీ కెమెరాలో రికార్డయ్యింది. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2 గంటల సమయంలో ఓ యువకుడు మాస్క్ ధరించి, రెండు లీటర్ల బాటిల్ తీసుకొచ్చాడు. అటూఇటూ గమనించి, ఇంటిముందు ఆపిన బైకు వద్దకు వెళ్లాడు. రెండు లీటర్ల బాటిల్‌లో పెట్రోలు నింపుకొని అక్కడి నుంచి ఉడాయించాడు. శివారు ప్రాంతాల్లో ఇటీవల ఈరకమైన దొంగతనాలు అధికమయ్యాయి. బైకుల, కార్లలో బ్యాటరీలు కూడా ఎత్తుకెళ్తున్నారంటూ స్థానికులు వాపోతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట పంచాయతీ కార్మికులు ధర్నా చేశారు. సంగమేష్ సర్కిల్ నుంచి ర్యాలీగా వచ్చి, కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గోపాల్ మాట్లాడారు. అనంతరం డీఆర్‌ఓ గాయత్రి దేవికి నాయకులు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

అనంతపురం టవర్‌క్లాక్: ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబిలేసు కేంద్రాన్ని కోరారు. శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కుంటిమద్ది ఓబిలేసు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నివేదిక సమర్పించారని, కేంద్ర ప్రభుత్వం కూడా రాబోవు సమావేశాల్లో ఎస్సీవర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మద్దిలేటి, రామాంజనేయులు, వెంకటేష్, రామాంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉన్నత స్థాయి

ఆత్మకూరు: విద్యార్థి దశ నుంచే కష్టపడి చదివితేనే ఉన్నత స్థాయికి చేరుకుంటారని కర్నూల్ మెడికల్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ భవానీ ప్రసాద్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు పదో తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన జ్యోషికకు రూ.10 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన నాజిన్‌కు రూ.7 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన ఆదర్శకు రూ.5 వేలను ప్రోత్సాహక బహుమతులు అందించారు. అనంతరం డాక్టర్ భవానీప్రసాద్, ఆయన సతీమని కవితను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజనేయులు మాజీ జెడ్పీటీసీ బంధూక మధు, లక్ష్మీనారాయణ, లక్ష్మీనరసింహ, సోము పాల్గొన్నారు.

రాయితీతో విత్తనాల పంపిణీ

రాప్తాడురూరల్: ఆర్‌బీకేల్లో రాయితీతో విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయశాఖ అనంతపురం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు రవి పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం రూరల్ కక్కలపల్లిలో సర్పంచ్ గాండ్ల కృష్ణయ్య అధ్యక్షతన గ్రామస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 80 శాతం రాయితీతో ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను సరఫరా చేస్తుందన్నారు. త్వరలోనే ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. పీఎం కిసాన్, రైతు భరోసా, సీసీఆర్సీ కార్డ్, పంట యాజమాన్య పద్ధతులపై వివరించారు. ఆర్‌బీకే ఎరువులు, విత్తనాలు తదితర సరఫరా చేస్తామన్నారు. యూరియా 45 కేజీల బస్తా బదులుగా నీటి మందు (లిక్విడ్ రూపంలో) ఒక లీటర్, 500 ఎంఎల్ రూపంలో ఎరువుల దుకాణాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏఓ శశికళ, ఏఈఓలు అలేఖ్య, ప్రసాద్, వీఎస్ఏ కిశోర్, రైతులు పాల్గొన్నారు.

నరేష్‌కుమార్ రెడ్డికి అండగా నిలుద్దాం

ఆత్మకూరు: ఏపీరెడ్డి సంఘం వ్యవస్థాపకుడు గంగలకుంట నరేష్‌కుమార్‌రెడ్డికి రెడ్డి సోదరులు అండగా నిలుద్దామని ఏపీ రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు రేనాటి నాగేశ్వర రెడ్డి శుక్రవారం పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నరేష్‌కుమార్‌రెడ్డిపై ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వీరయ్య ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాడన్నారు. జిల్లా కేంద్రంలో రెడ్డిసోదరులు శనివారం సమావేశమై నరేష్‌కుమార్ రెడ్డికి మద్దతుగా నిలుద్దామని పిలుపునిచ్చారు.

ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి

ఆత్మకూరు: ప్రతి ఒక్కరూ ఆరోగ్యజాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ దయాకర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పి.యాలేరు గ్రామంలో వైద్య సిబ్బంది ప్రజలకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ నాగేశ్వరయ్య, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

శాంతిభద్రతలు కాపాడాలి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఎస్ఎస్‌యూఐ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మణిపూర్‌లో జరిగిన అరాచకాలపై నిరసన తెలిపారు. మణిపూర్ శాంతి భద్రతలను కాపాడడంతో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు బేగం, అశ్విని, రూపిక, మారెన్న, తిరుమలేష్, వంశీ చంద్, పవన్, సలీం, నాగశేఖర్, వర ప్రసాద్ పాల్గొన్నారు.

మణిపూర్ అరాచకాలపై రాస్తారోకో

ఆత్మకూరు: మండల కేంద్రంలో సీపీఐ ఎంఎల్ ఆధ్వర్యంలో మణిపూర్ సంఘటనపై రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాస్తారోకో చేశారు. సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి పెద్దన్న మాట్లాడారు. మణిపూర్ అల్లర్లపై ప్రధానమంత్రి కనీసం స్పందించలేదని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ పార్టీ కార్యకర్తలు చంద్రశేఖర్, మల్లేశ్వరి, పార్వతి, జయప్ప, పాల్గొన్నారు.